ప్రజాశక్తి
బుధవారం 10 డిసెంబర్ 2025
5
పార్వతీపురం మన్యం

డిఇఒగా బ్రహ్మాజీ రావు



ప్రజాశక్తి - పార్వతీపురం

మన్యం జిల్లా విద్యాశాఖ అధికారిగా పి.బ్రహ్మాజీరావు నియామకమయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. అల్లూరి సీతారామరాజు జిల్లా డిఇఒగా పనిచేస్తున్న బ్రహ్మాజీ రావుకు మన్యం జిల్లా డిఇఒగా బదిలీ చేశారు. ఇక్కడ డిప్యూటీ డిఇఒ రాజ్ కుమార్ ప్రస్తుతం డిఇఒగా వ్యవహరిస్తున్నారు.

నాసిరకం సామాగ్రితో నిర్మాణాలు

- బర్త్ వెయిటింగ్ హోమ్ పనుల్లో కొరవడిన నాణ్యత
- బయటపడుతున్న డొల్లతనం

ప్రజాశక్తి - కొమరాడ

ప్రభుత్వాసుపత్రుల వద్ద గర్భిణులకు ప్రసవ సమయంలో ఇబ్బందులేకుండా ఉండేందుకు ముందస్తు ప్రసవాల కోసం ఏర్పాటు చేస్తున్న వసతి గృహాల బర్త్ వెయిటింగ్ హోం నిర్మాణ పనుల్లో డొల్లతనం స్పష్టంగా కనిపిస్తుందని మండల ప్రజల నుంచి ఆరోపణ వినిపిస్తున్నాయి. స్థానిక పిహెచ్‌సి వద్ద జబిలి కాలంలో మంజూరైన బర్త్ వెయిటింగ్ హోమ్, గర్భిణి వసతి గృహ నిర్మాణ పనుల్లో పూర్తిగా డొల్లతనం, నాసిరకం సిమెంటు, ఇటుక వాడడంతో అటుపక్క వెళ్లే రోగులు చూసి పనుల డొల్లతనంపై ముక్కున వేలేసుకొనే పరిస్థితి ఏర్పడింది. ప్రతి ప్రభుత్వాసుపత్రి వద్ద ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో ఉన్న ఆసుపత్రులకు గర్భిణులను ముందస్తుగానే ప్రసవ సమయంలో ఇబ్బందులు లేకుండా ఆసుపత్రి వద్ద వసతి గృహంలో ఉంచి అవసరమైన వైద్య సేవలందించి ప్రసవ సమయంలో ఎటువంటి ఇబ్బందులేకుండా ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. ఈ నేపథ్యంలో గర్భిణుల వసతి గృహాల కోసం ఐ.ఎటి నిధులు సుమారు రూ.35లక్షలతో చేపడుతున్న భవన నిర్మాణ పనుల్లో నాణ్యత లోపాలు స్పష్టంగా కనిపిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇతర ప్రాంతాలకు చెందిన వ్యక్తి కాంట్రాక్టర్‌గా రావడం, ఇక్కడి పరిస్థితులకు అనుగుణంగా పనులు చేయించకపోవడంతో పనుల్లో డొల్లతనం స్పష్టంగా కనిపిస్తుందని స్థానికుల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇంత పెద్ద భవన నిర్మాణ పనులు జరుగుతున్నా సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు కనీసం పర్యవేక్షించకుండా నిర్లక్ష్యం వహిస్తుండడంతో కాంట్రాక్టర్ నాసిరకంతో పనులు చేస్తున్నారన్న వాదనలు కూడా వినిపిస్తున్నాయి. ప్రభుత్వ నిబంధన ప్రకారం 53 గ్రేడ్ ఉన్న సిమెంట్ ను వాడాల్సి ఉన్నప్పటికీ నాసిరకమైన పక్కనే ఉన్న ఒడిశాకు చెందిన సిమెంట్ బస్తాలను వాడడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పునాది గట్టిగా ఉంటేనే భవనం దృఢంగా ఉంటుంది.

నాసిరకం ఇటుక, సిమెంట్‌తో నిర్మిస్తున్న అదనపు భవనం

అలాంటి పునాది గట్టిగా లేకపోతే భవనం వేగంగా శిథిలావస్థకు చేరే అవకాశాలు స్పష్టంగా ఉంటాయి. అలాంటిది కొమరాడ ఆసుపత్రి వద్ద కొత్తగా చేపడుతున్న భవన నిర్మాణం పునాదిల్లోనే నాణ్యత లేకుండా పనులు చేస్తున్న చర్చ వినిపిస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాణ్యమైన సిమెంటు, ఇటుక వాడాల్సి ఉన్నప్పటికీ అధికారుల నిర్లక్ష్యం, అలసత్వాన్ని ఆసరాగా తీసుకుని కాంట్రాక్టర్ డబ్బులు మిగిల్చుకునేందుకు నాసిరకం సిమెంటు, సిమెంటు ఇటుకలను వాడడంతో నిర్మాణ పనుల్లో స్పష్టంగా డొల్లతనం కనిపిస్తుంది. ఇప్పటికైనా ఇంజినీరింగ్ అధికారులు భవన నిర్మాణ పనులను పర్యవేక్షించి, నాణ్యతతో నిర్మించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రెవెన్యూ సేవలపై సంతృప్తి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

ఒక రోజు ఒక ప్రయత్నం.. మనం రెవెన్యూ క్లినిక్ పేరుతో జాయింట్ కలెక్టర్ నాయకత్వంలో రెవెన్యూ సమస్యలకు చెక్ పెట్టినట్లు కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో రెవెన్యూ సమస్యల శాశ్వత పరిష్కారానికి బీజం వేశామని, తమ సమస్యలు పరిష్కారం కావడం పట్ల అర్జీదారులు శత శాతం సంతృప్తి చెందినట్లు ఫోన్ కాల్ ద్వారా తెలుసుకున్నట్లు చెప్పారు. ఇది రెవెన్యూ క్లినిక్ అతిపెద్ద విజయమని, ఎవరికైనా రెవెన్యూ సమస్యలు ఉంటే రెవెన్యూ క్లినిక్‌ను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 29న జిల్లాలో రెవెన్యూ క్లినిక్‌ను ప్రారంభించగా, నేటివరకు 9 రెవెన్యూ క్లినిక్‌లు జరిగాయని తెలిపారు. వీటిలో మొదటి 6 వారాలకు సంబంధించిన అన్ని సమస్యల్ని పరిష్కరించామన్నారు. తదుపరి మూడు వారాల గ్రీవెన్స్‌లో 30 తప్ప మిగతావన్నీ పరిష్కరించినట్లు చెప్పారు. ఆరు వారాల్లో 227 ఫిర్యాదులు అందగా, అవన్నీ పరిష్కరించబడ్డాయన్నారు. ఈ విషయంలో జేసీ, డిఆర్ఓ, సబ్ కలెక్టర్లు, కలెక్టరేట్ సిబ్బంది, తహశీల్దార్లు మంచి కృషి చేశారని కొనియాడారు. ఎవరైనా రెవెన్యూ సంబంధిత సమస్యలు ఉన్నట్లయితే వంటి వారు రెవెన్యూ క్లినిక్‌ను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ గతంలో గ్రీవెన్స్ తీసుకొని సబ్ కలెక్టర్ లేదా తహశీల్దార్‌కు ఎండార్స్ చేసేవారమని, ఆ తర్వాత అది పరిష్కారమైందా, లేదా అన్న సమాచారం ఉండేదికాదని అన్నారు. ప్రస్తుతం వాటికి చెక్ పెట్టి అక్కడికక్కడే పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. రెవెన్యూ క్లినిక్ సబ్ కలెక్టర్లు, తహశీల్దార్లు విజయవంతం చేశారని, ఇదే పద్ధతిలో అధికారం వినతులలో మిగతా శాఖల్లో ఇలాంటి విధానాన్ని తీసుకురాబోతున్నట్లు చెప్పారు. జిల్లాలో ఈ ఫిర్యాదులు కచ్చితంగా తగ్గి తీరాలనే లక్ష్యంతో జిల్లా యంత్రాంగం మొత్తం కూడా పనిచేస్తుందని జేసీ వివరించారు. సమావేశంలో డిఆర్ఓ కె.హేమలత, సబ్ కలెక్టర్లు ఆర్.వైశాలి, పవార్ స్వప్నిల్ జగన్నాథ్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రభాకరరెడ్డి

గర్భిణులకు ఆరోగ్య తనిఖీలు

సీతానగరం : మండలంలోని సీతానగరం, పెద అంకలాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మంగళవారం పిఎంఎస్ఎంఎ పథకం కింద గర్భిణులకు వైద్యాధికారులు పి.ఉషారాణి, పి.పావని, పి.శ్రీకాంత్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పౌష్టికాహారం తదితర అంశాలను వివరించారు. ప్రతినెలా తప్పక గర్భిణీ తనిఖీలు నిర్వహించుకోవాలన్నారు. ప్రభుత్వాసుపత్రిలోనే ప్రసవాలు అయ్యేలా ఉండాలని సూచించారు. అనంతరం సత్యసాయిబాబా ట్రస్ట్ నుంచి గర్భిణులకు భోజన సదుపాయాన్ని కల్పించారు.

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న విఆర్ఎలు

సమస్యలు పరిష్కరించాలని విఆర్ఎల ధర్నా

ప్రజాశక్తి - పార్వతీపురం

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ విఆర్‌ఎ లు మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. రెవెన్యూ గ్రామ సహాయకుల సంఘం ఆధ్వర్యాన నిర్వహించిన ధర్నా నుద్దేశించి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు, సంఘం జిల్లా అధ్యక్షులు జి.ఈశ్వరరావు మాట్లాడుతూ టిడిపి కూటమి అధికారంలోకి వచ్చి 18నెలలైనా ఒక్క సమస్య కూడా పరిష్కరించలేదన్నారు. గత 8 ఏళ్లుగా జీతాలు పెంచలేదని చెప్పారు. విఆర్‌ఎలతో వెట్టిచాకిరీ పనులు చేయిస్తున్నారని చెప్పారు. పక్కనున్న తెలంగాణలో విఆర్‌ఎలకు పే స్కేలు అమలు చేస్తున్న విధంగా రాష్ట్రంలోనూ అమలు చేయాలని డిమాండ్ చేశారు. విఆర్వోలుగా ఉద్యోగోన్నతులు కల్పించాలని, నామినీలను విఆర్‌ఎలుగా పరిగణించాలని కోరారు. పెరిగిన ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి జి.కృష్ణ, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి వేణు మాట్లాడారు.

కొమరాడ : విఆర్‌ఎల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సమస్యలను పరిష్కరించాలంటూ విఆర్‌ఎలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సాంబమూర్తి మాట్లాడుతూ చాలీ చాలని జీతంతో ఇబ్బంది పడుతున్న విఆర్‌ఎలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే పంచాయతీల్లోని విఆర్‌ఎలు కలెక్టర్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న సందర్భంగా గ్రామాల్లో కూడా కొన్ని సమస్యలు ఉన్నాయని తెలిపారు.

క్రీడాకారుల అభివృద్ధికి ప్రత్యేక కార్యక్రమం

కామన్వెల్త్ గేమ్స్‌లో జిల్లా వాసులు ప్రాతినిధ్యం వహించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలోని పాఠశాల నుంచి కళాశాల స్థాయిలో గల క్రీడాకారులను, ప్రతిభావంతులను గుర్తించి, వారికి పూర్తి స్థాయి శిక్షణ ఇచ్చి ప్రోత్సహించేలా ఒక ప్రత్యేక క్రీడా కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి పేర్కొన్నారు. ఈ విషయాన్ని కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో కలెక్టర్ ప్రకటించారు. మన్యం జిల్లాలో క్రీడాకారులకు, ప్రతిభ కలిగిన వారికి కొదువలేదన్నారు. వీరి స్థాయికి తగినట్లుగా చాలామంది అర్జున అవార్డు గ్రహీతలు, కోడి రామ్మూర్తి నాయుడు వంటి ప్రపంచ ప్రఖ్యాతి చెందిన వెయిట్ లిఫ్టర్లు ఉన్నారని అన్నారు. అదేవిధంగా అనేకమంది జాతీయ, రాష్ట్ర స్థాయి క్రీడాకారులతో పాటు ఇటీవల కూడా చాలామంది క్రీడాకారులు ఎంపికైన సంగతిని కలెక్టర్ గుర్తుచేశారు. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకొని జిల్లాలో విద్యార్థి స్థాయి నుంచి కళాశాల వరకు కూడా ప్రత్యేక దృష్టి సారించి, క్రీడలపై పూర్తి స్థాయి తర్ఫీదు ఇవ్వడానికి వీలుగా ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టాలని జిల్లా యంత్రాంగం నిర్ణయించిందని తెలిపారు. ఇందులో భాగంగా 13 క్రీడా విభాగాల్లో జిల్లా స్థాయిలో ఎంపికలు జరుగుతాయని, జిల్లా వ్యాప్తంగా ఎంపికలను నిర్వహించి తగిన ప్రతిభ, అర్హత కలిగిన క్రీడాకారులను గుర్తించి, వారు ఎక్కడ చదువుతున్నప్పటికీ ఒక ప్రత్యేకమైన స్పోర్ట్స్ స్కూల్‌ను గుర్తించి తగిన తర్ఫీదు ఇస్తామన్నారు. అవసరాన్ని బట్టి శిక్షణ కేంద్రాలను పెంచేలా నిర్ణయిస్తామన్నారు. శిక్షణా కేంద్రాల్లో అవసరమైన పోషకాహారం, ప్రత్యేకమైన శిక్షణ అందించి జాతీయ, అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళ్లాలనేది లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు కలెక్టర్ వివరించారు.

పాఠశాల స్థాయిలో ఎంపికలు ఈనెల 12, 13 తేదీల్లో వారి స్కూళ్లల్లో జరుగుతాయని అన్నారు. ఎంపికైన వారిని ఈనెల 15, 16, 17 తేదీల్లో జిల్లా స్థాయిలో జరిగే పోటీల్లో ఎంపికలు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనపరిచిన వారందర్నీ గుర్తించిన క్రీడా కేంద్రాల్లో ప్రవేశాలు ఉంటాయాన్నారు. అక్కడ వారికి ప్రత్యేక కోచింగ్ ఇచ్చి వారిని అంతర్జాతీయ క్రీడాకారులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో దీన్ని ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. అదే విధంగా జిల్లాలో వాటర్ స్పోర్ట్స్ (జల క్రీడలు) నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. పార్వతీపురం ఐటిడిఎ పిఒ ఆధ్వర్యంలో తాటిపూడి విశాఖపట్నంలో ఉన్నటువంటి వాటర్ స్పోర్ట్స్ మెటీరియల్‌ను ఇక్కడికి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. ఇప్పటికే శాప్‌తో మాట్లాడామని, స్పోర్ట్స్ అథారిటీ వారు కూడా మనకు అంగీకారం తెలిపారని కలెక్టర్ గుర్తుచేశారు. ఆ వాటర్ స్పోర్ట్స్ ఏర్పాటైతే, వాటిలో కూడా పిల్లల్ని ఎంపిక చేస్తామని వివరించారు.

2030లో కామన్ వెల్త్ గేమ్స్ భారతదేశానికి కేటాయించబడ్డాయని, అందుకు ఇంకా ఐదేళ్ల గడువు ఉన్నందున, ఈలోగా జిల్లా క్రీడాకారులకు తగిన శిక్షణ ఇచ్చి, జిల్లా వాసులు కామన్ వెల్త్ గేమ్స్‌లో పాల్గొనేలా చేయాలనేది దీర్ఘకాలిక లక్ష్యమని కలెక్టర్ చెప్పారు. అందులో భాగంగా మనకు ఉండే మంచి ఫిజికల్ డైరెక్టర్లు, పిఇటిలను కూడా పిలిచామన్నారు. వీరందరి సహకారంతో మన్యం జిల్లా క్రీడా కేంద్రంగా మార్చాలని అనుకుంటున్నట్లు పేర్కొన్నారు. మన్యం జిల్లాలోని క్రీడాకారులకు ఒక ఉజ్వల భవిష్యత్తు ఇవ్వాలనేది లక్ష్యంగా దీన్ని ఏర్పాటు చేసుకున్నామని, మనది గిరిజన ప్రాంతమైనందున స్పోర్ట్స్ కోటాలో 3శాతం రిజర్వేషన్ ఉందని, ఈ రిజర్వేషన్ ద్వారా ఉద్యోగాలు, ప్రవేశాలు పొందడానికి అరుదైన అవకాశమని తెలిపారు. మన పిల్లలు జాతీయ స్థాయిలో ఆడగలిగితే వాళ్ళకి స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు వస్తాయని, ఎస్టీ రిజర్వేషన్‌తో పాటుగా స్పోర్ట్స్ రిజర్వేషన్ కూడా వాళ్ళు వాడుకోవడానికి అవకాశాలున్నాయన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

మిల్లు వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

ధాన్యం కొనుగోలులో దోపిడీ

అదనంగా ధాన్యం ఇవ్వాలని మిల్లరు డిమాండ్

ఎన్‌ఎస్‌ఎన్ మిల్లు వద్ద రైతుల ఆందోళన

ప్రజాశక్తి - పాలకొండ

ధాన్యం కొనుగోలులో రైతులకు దోపిడీ తప్పడం లేదు. మిల్లర్లు ఆడిందే ఆట పాడిందే పాటగా సాగుతుంది. మండలంలోని బాసూర నుంచి 100 ధాన్యం బస్తాలు అన్నవరం రోడ్‌లో ఉన్న ఎన్‌ఎస్‌ఎన్ మిల్లుకు తీసుకెళ్లగా, 80 కేజీలు బస్తాకు అదనంగా నాలుగు కేజీలు ఇవ్వాలని అక్కడ మిల్లరు రైతులను డిమాండ్ చేశారు. రెండు కేజీలు ఇస్తామని చెప్పినప్పటికీ ఒప్పుకోపోవడంతో అక్కడే ధాన్యం విడిచిపెట్టి తహశీల్దార్ కార్యాలయం వద్దకు వచ్చి రైతులు నిరసన తెలిపారు. అక్కడ కూడా అధికారులెవరూ స్పందించకపోవడంతో మిల్లు దగ్గరకెళ్ళి ఆందోళనకు దిగారు. దీంతో మండల వ్యవసాయ అధికారి ప్రసాదరావు మిల్లరు అడిగిన దాంట్లో తప్పేముందంటూ చెప్పడంతో రైతుల మరింత ఆగ్రహానికి లోనయ్యారు. రైతులంటే అంత చులకనా అంటూ వాగ్వాదానికి దిగారు. సిఎస్‌డిటి సన్యాసిరావు, ట్రైనీ ఎస్ఐ శ్రీలత, విఆర్ఒ బంకి రాజా మిల్లరుతో మాట్లాడారు. ఈ లోడు 80కేజీల తీసుకుంటానని, మిగిలిన లోడ్లు అలా తీసుకొనే పరిస్థితి లేదని మిల్లరు ఖరాఖండీ చెప్పడంతో ధాన్యాన్ని రోడ్డుమీద పారేస్తామంటూ రైతుల ఆవేశానికి గురై బయలుదేరారు. దీంతో పోలీసులు రైతులను సముదాయించారు. మిల్లరు కూడా చివరికి మండల వ్యవసాయ శాఖ అధికారులతో కల్లాల్లో ధాన్యం శాంపిల్‌ను పరీక్ష చేసి అంతా సక్రమంగా ఉంటే నిబంధన ప్రకారం తీసుకుంటానని చెప్పడంతో రైతులు శాంతించారు.

కలెక్టర్‌కు ఎంఇఒల సత్కారం

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

ముస్తాబు కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి ప్రశంసలు అందుకున్న మన్యం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర్‌రెడ్డిను ఎంఇఒలు మంగళవారం దుశ్శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యం, పరిశుభ్రతపై కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ముస్తాబు అనే కార్యక్రమాన్ని రూపొందించారని, ఈ కార్యక్రమం వల్ల విద్యార్థుల్లో వారి ఆరోగ్య అలవాట్ల పట్ల అవగాహన కలగడంతో పిల్లలంతా చక్కగా ఆరోగ్యంగా ఉన్న పరిస్థితి నెలకొందన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు భామినిలో జరిగిన మెగా పిటిఎంలో పాల్గొన్న సందర్భంగా ముస్తాబు కార్యక్రమాన్ని జిల్లాలో అమలు చేయడం పట్ల కలెక్టర్‌కు అభినందనలు తెలియజేయడం ఎంతో హర్షనీయమన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ-1 అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.సింహాచలం, ఉపాధ్యక్షులు జె.నారాయణస్వామి, పలువురు ఎంఇఒలు పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రం వద్ద ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి, జిల్లా సివిల్ సప్లయ్ అధికారి

కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన అధికారులు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని అంటిపేట, రామవరం ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా వ్యవసాయాధికారి రెడ్డి అన్నపూర్ణ, జిల్లా సివిల్ సప్లైస్ అధికారి కె.శ్రీనివాసరావు పరిశీలించారు. అలాగే రైస్ మిల్లులను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ తనిఖీలో అంటిపేట, రామవరం ధ్యానం కొనుగోలు కేంద్రాల వద్ద అనుసరిస్తున్న నాణ్యతా ప్రమాణాలను పరీక్షించారు. 17శాతం కన్నా తక్కువగా ఉండేలా చూసి అలా ఉన్న ధాన్యాన్ని మాత్రమే మిల్లులకు పంపించాలని ఆదేశించారు. అలాగేకొనుగోలు సిబ్బంది ఎటువంటి అపోహలకు అవకాశం ఇవ్వకుండా తమ విధులను నిర్వహించాలని తెలిపారు. అలాగే రికార్డులను పరిశీలించారు. అనంతరం రైతులతో ముఖాముఖి మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం ఉచితంగా గోనె సంచులు సరఫరా చేస్తున్నట్టు తెలిపారు. ఒకవేళ రైతు సొంతంగా గోనె సంచులు కొనుకుంటే రూ.4.74 రైతులు ఇస్తామని, హమాలీ చార్జీల భారం కూడా ప్రభుత్వం తీసుకుంటుందని అన్నారు. అనంతరం మండలంలో గల శ్రీవెంకటేశ్వర మినీ మోడర్న్ అండ్ ఫ్లోర్ మిల్లు, కాశాపేట అలాగే ఆద్య మోడర్న్ రైస్ మిల్లు లక్ష్మీపురం, శ్రీ వెంకటేశ్వర వెన్నెల ఆగ్రో ఇండస్ట్రీస్, చాకరాపల్లె మిల్లులకు తనిఖీ చేశారు. మిల్లుల వద్ద ఎప్పటికప్పుడు వచ్చిన ధాన్యాన్ని వెంటనే అన్లోడ్ చేసుకొని కస్టడియన్ ఆఫీసర్ లాగిన్‌లో క్లియర్ చేయాలని ఆదేశించారు.కార్యక్రమంలో ఎంపిడిఒ ఎంఎల్ఎన్ ప్రసాద్, తహశీల్దార్ జై ప్రశాంత్ కుమార్, ఆర్ఐ ఎన్.శ్రీనివాసరావు, ఎఒ ఎస్.అవినాష్, డిడి ఉమామహేశ్వరతో పాటు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు

బకాయి వేతనాలు చెల్లించాలని గ్రీన్ అంబాసిడర్ల ధర్నా

ప్రజాశక్తి - కురుపాం

బకాయి వేతనాలు చెల్లించాలంటూ జియ్యమ్మవలస మండల పరిషత్ కార్యాలయం ఎదుట మంగళవారం గ్రీన్ అంబాసిడర్లు ధర్నా చేపట్టారు. ఈ ధర్నానుద్దేశించి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కొల్లి గంగునాయుడు మాట్లాడుతూ శుభ్రత కోసం గ్రామాల్లో చెత్తను తొలగిస్తూ, ప్రజల ఆరోగ్య భద్రత కోసం కష్టపడుతున్న గ్రీన్ అంబాసిడర్లకు సరైన వేతనాలు అందడం లేదన్నారు. ఇచ్చిన అరకొర వేతనం కూడా మూడు, ఆరు నెలల వేతనాలు బకాయిలు పెడుతున్నారన్నారు. చెత్త తొలగింపు సమయంలో అనేక రకాల అనారోగ్యాలకు గురవుతున్నప్పటికీ రక్షణ కోసం అవసరమైన యూనిఫారాలు, చెప్పులు కూడా ఇవ్వకపోవడం తీవ్ర విమర్శనీయమని పేర్కొన్నారు. జీతాలు నేరుగా బ్యాంక్ ఖాతాల్లో జమ చేయాలని, ప్రతి కార్మికుడికి రూ.4వేలు మెడికల్ అలవెన్స్ ఇవ్వాలని, పని చేయడానికి కొత్త బల్లులు తక్షణం సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. తదుపరి తమ డిమాండ్లకు సంబంధించిన వినతి పత్రాన్ని మండల పరిషత్ కార్యాలయంలోని సీనియర్ అసిస్టెంటుకు అందజేశారు. కార్యక్రమంలో గ్రీన్ అంబాసిడర్లు ఆరిక అర్జున, గుండయ్య, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మండల పరిషత్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న గ్రీన్ అంబాసిడర్లు

మంచినీటి సమస్య లేకుండా చేస్తా : మంత్రి

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలో తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని రాష్ట్ర గిరిజన శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. మంగళవారం స్థానిక మున్సిపాల్టీలోని పలు వార్డుల్లో 8 కొత్త పైలట్ వాటర్ స్కీమ్స్‌ను ఆమె ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ తాగునీటి కొరత లేకుండా ప్రతి వార్డులోనూ వాటర్ ట్యాంకులు నిర్మించే బాధ్యతను కూటమి ప్రభుత్వం తీసుకుంటుందని హామీ ఇచ్చారు. ప్రారంభించిన ఒక్కో పైలట్ వాటర్ స్కీమ్ వ్యయం రూ.1.80 లక్షలు కాగా, మొత్తం 8 స్కీమ్స్‌కు కలిపి రూ.14.40 లక్షలు వెచ్చించామని, వడ్డీ వీధి, కోట వీధి, పెద హరిజన పేట, బోను మహంతి వీధి, రామ కాలనీ ప్రాంతాలలో వీటిని ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షులు నిమ్మాది తిరుపతిరావు, జనసేన నాయకులు జరజాపు సూరిబాబు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మంచినీటి పథకాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సంధ్యారాణి

నిత్యవసర సరుకుల సరఫరాకు టెండర్లు

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఐటిడిఎ పరిధిలో గల గురుకులాలు ఆశ్రమ పాఠశాలలో పోస్టుమెట్రిక్ వసతి గృహాలకు నిత్యవసర సరుకులు సరఫరా చేయడానికి మంగళవారం ఐటిడిఎ అధికారులు టెండర్లు నిర్వహించారు. 25 రకాల నిత్యవసర సరుకులు, పది రకాల కాస్మొటిక్స్ కిట్లు సరఫరా చేయడానికి పదిమంది టెండరుదారులు పాల్గొన్నారు. నాణ్యమైన సరుకుల సరఫరా చేయాలని డిడి అన్నదొర అన్నారు. కార్యక్రమంలో జిసిసి జనరల్ మేనేజర్ సంధ్యారాణి, పిహెచ్ఒ వెంకట గణేష్, మేనేజర్లు దాసరి కృష్ణ, గొర్లె నరసింహులు, అకౌంటెంట్ చినబాబు ఎటిడబ్ల్యూ సూర్యనారాయణ, సూపరింటెండెంట్ ఆర్.ధర్మారావు, వసతి గృహాల సంక్షేమాధికారులు తదితరులు పాల్గొన్నారు.

టెండర్లు తెరుస్తున్న జిసిసి అధికారులు

ఆలయంలో చోరీ

ప్రజాశక్తి -భామిని

లివిరి గోపీనాథ స్వామి ఆలయంలో సోమవారం రాత్రి దొంగలు చోరీకి పాలపడ్డారు. ఆలయ పూజారి మంగళవారం గుడికి వెళ్లి చూస్తే తలుపులు తెరిచి ఉండడంతో వెంటనే ఆలయం కమిటీ సభ్యులకు విషయం తెలిపాడు. పోలీసులకు సమాచారం అందించడం తో మంగళవారం డిఎస్‌పి రాంబాబు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్రైమ్ టీం, క్లూస్ టీం సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. బత్తిలి ఎస్ఐ అప్పారావు తెలిపిన వివరాలు ప్రకారం సోమవారం అర్ధరాత్రి 1 గంట ప్రాంతంలో ఆలయంలో మూడు తలుపు తెరిచి, దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటనలో 56 తులాల వెండి, అర తులం బంగారం, రూ.15వేలు నగదును అపహరించినట్లు తెలిపారు. సిసి పుటేజి, స్టోరేజీ బాక్స్‌ను కూడా దొంగలు అపహరించినట్లు పోలీసులు తెలిపారు. చోరీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

ప్రజాశక్తి - కొమరాడ

ప్రతి గ్రామంలోనూ పేదరికం లేని సమాజం కోసం మహిళా సంఘాల సభ్యులు పూర్తిస్థాయిలో కృషి చేసి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఎపిఎం సురేష్‌బాబు అన్నారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఎంసిఎల్‌పి విజన్ బిల్డింగ్ మెడ్యువల్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమం ఈనెల 9నుంచి 12 వరకు స్థానిక వెలుగు కార్యాలయంలో జరుగుతుందని తెలిపారు. మహిళా సంఘాలు అధికంగా అభివృద్ధి చెందుతూ తమ కుటుంబాలను బలోపేతం చేసుకొనేలా ఈ శిక్షణలో అవగాహన కల్పిస్తామన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో మహిళా సంఘాల సభ్యులు లీడర్లకు, మండల సమాఖ్య సభ్యులకు మైక్రో లాబ్‌లో టూల్స్ గ్రూపు డిస్కషన్ చేసి మహిళా సంఘాల సభ్యులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని వారు గ్రామస్థాయిలో మహిళలకు అవగాహన కల్పిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో మహిళలు సద్వినియం చేసుకొని ఆర్థిక అభివృద్ధి చెందుతూ పలువురికి ఆదర్శంగా నిలవాలని కోరారు. ఈ శిక్షణలో జనరల్ సిసిలు నాయక్, రమేష్, ఈశ్వరమ్మ, శారద, రామకృష్ణ, అప్పలనాయుడు, విఒఎలు, ప్రెసిడెంట్లు, మండల సమాఖ్య ఇసి సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డును మరమ్మతులు చేయిస్తున్న రైతు బసవయ్య

సొంత నిధులతో రోడ్డు గుంతలను పూడ్చిన రైతు

ప్రజాశక్తి - సాలూరు

మండలంలోని కొట్టుపరువు పంచాయతీ పరిధిలో గల ఎర్రగడవలస జంక్షన్ నుంచి బూర్జి జంక్షన్ వరకు సుమారు 400 మీటర్ల రోడ్డు గత 20ఏళ్లుగా కనీసం మరమ్మతులకు కూడా నోచుకోక, ప్రయాణానికి అత్యంత కష్టంగా మారింది. ముఖ్యంగా వర్షాకాలంలో పామాయిల్ లారీలు నిరంతరంగా ఈ రోడ్డుపై తిరగడం వల్ల భారీ గోతులు ఏర్పడి, ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే స్థానిక రైతులు నిత్యం ప్రమాదాలకు గురై, గాయాలపాలవుతున్నారు. ఈ దుస్థితిని చూసి చలించిపోయిన స్థానిక రైతు పూడి బసవయ్య తన సొంత డబ్బు ఖర్చు చేసి రోడ్డుపై ఉన్న అన్ని గోతులను పూడ్పించారు. బసవయ్య తీసుకున్న నిర్ణయం స్థానిక రైతులందరికీ ఎంతో ఉపశమనాన్ని ఇచ్చింది. వ్యవసాయ ఉత్పత్తులను తరలించడానికి, రోజువారీ అవసరాల కోసం ప్రయాణించడానికి ఉపయోగించే ఈ రోడ్డు ప్రయాణ యోగ్యంగా మార్చినందుకు స్థానిక రైతులు, ప్రజలు బసవయ్యను అభినందించారు.

హామీలను నెరవేరుస్తా : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - సీతానగరం

ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని కూటమి ప్రభుత్వం నెరవేరుస్తుందని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయ చంద్ర అన్నారు. మండలంలోని బూర్జ పంచాయతీలో బూర్జ, కృష్ణరాయపురం, అంకలం గ్రామాలకు వెళ్లే రహదారి నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల ముందు ఈ గ్రామంలో పర్యటించిన సందర్భంగా రహదారి నిర్మాణానికి ఇచ్చిన హామీ మేరకు ఇప్పుడు రహదారిని నిర్మించడం జరుగుతుందన్నారు. బూర్జ నుంచి పెదఅంకలం వరకు రూ.50 లక్షలతో ఈ రోడ్డు నిర్మాణం జరుగుతుందన్నారు. గ్రామానికి ఇచ్చిన నాలుగు హామీల్లో బీటీ రోడ్డు, సిసి రోడ్డు, కాలువల పనులు ప్రారంభించామని, త్వరలోనే తాగునీటి సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. అలాగే మొదటి ఫేజ్‌లో బగ్గందొరవలస, గెడ్డలుప్పి, తామరఖండి గ్రామాలకు, రెండు ఫేజ్‌లో సీతానగరం నుంచి అజ్జాడ వరకు సంపూర్ణంగా రోడ్డు నిర్మాణం జరుగుతుందని అన్నారు. ఈ గ్రామానికి దీర్ఘకాల కలగా ఉన్న వంతెన నిర్మాణానికి 6 కోట్ల రూపాయలు నిధులు మంజూరయ్యాయని, త్వరలోనే ఈ వంతెన నిర్మాణానికి మంత్రి చేతుల మీదుగా శంకుస్థాపన చేపట్టడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు కర్నేన పి.సత్యనారాయణ, ఆర్.వేణుగోపాలనాయుడు, మాజీ సర్పంచ్ ఎన్.జ్యోతిలక్ష్మి రెడ్డి, అన్నంనాయుడు, పిఎసిఎస్ అధ్యక్షులు పి.గౌరీనాయుడు, నాయకులు కె.బలరాం, తెంటు వెంకటప్పలనాయుడు, హరిగోపాలరావు, దామినేని పెద్దబ్బాయి, వివిధ గ్రామాల సర్పంచులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సేవా భావం అలవర్చుకోవాలి

ప్రజాశక్తి - పాలకొండ

విద్యార్థి దశ నుంచే సేవా భావం ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఎం.శ్యాంబాబు అన్నారు. ఈ నెల 3న డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ 1,2 యూనిట్ల ఆధ్వర్యంలో కార్యక్రమాలు చేపట్టారు. మంగళవారం ముగింపు కావడంతో పల్లా బాబ్జీ నగర్‌లో రిషి యోగా కేంద్రం దగ్గర పిచ్చి మొక్కలు విద్యార్థులు తొలగించారు. అదేవిధంగా యోగానందుల యోగా గురువు జనార్దనరావు దగ్గరుండి చేయించారు. ముగింపు కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ చక్కగా ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలు జరిగాయన్నారు. విద్యార్థులు చదువుతో పాటు సేవా కార్యక్రమాలు కూడా అలవాటు చేసుకోవాలన్నారు. విద్యార్థులు మంచి కార్యక్రమాలు చేపట్టి కళాశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఐదో వార్డ్ కౌన్సిలర్ వెలమల మన్మధరావు మాట్లాడుతూ డిగ్రీ కళాశాలలో జరుగుతున్న కార్యక్రమాలు చక్కగా ఉన్నాయని తమను కూడా భాగస్వామ్యం చేయడం ఆనందంగా ఉందన్నారు. కళాశాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమానికి పూర్తి సహకారాన్ని అందించిన నగర పంచాయతీ సమన్వయకర్త పల్లా కొండలరావుకు కళాశాల యాజమాన్యం విద్యార్థులు సన్మానించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కడగల రమణ, బాసూరు కాంతారావు, కె.విజయ్ కుమార్, కె. మోహన్, పడాల రాంబాబు, అడపా బాబ్జీ, సంతోష్ కుమార్, వైస్ ప్రిన్సిపల్ జయమణి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి రాజు, అధ్యాపకులు జగన్మోహన్, శాంతి తదితరులు ఉన్నారు.

మండల బడ్జెట్ ఆమోదం

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపిపి డి వెంకటరమణ నాయుడు అధ్యక్షతన 2026-27మండల వార్షిక బడ్జెట్ రూ. 56 కోట్ల 99 లక్షల. 25,043 సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. 2025-26 ఆర్థిక సంవత్సరం సవరించిన అంచనా బడ్జెట్ రూ. 54 కోట్ల 12,59,351 అంచనా వేసినట్టు ఆయన తెలిపారు. మంచినీటి సరఫరా, పారిశుధ్యం, విద్యుత్ , పెన్షన్ పంపిణీ, మొదలగు అంశాలు వాటి ఆమోదపు ఖర్చులు ఆదాయ వనరుల బట్టి అంచనా వేశారు. ఏకగ్రీవంగా తీర్మానం ఆమోదించినట్లు సభ్యులకు ఎంపిడిఒ బి.వెంకటరమణ అభినందించారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి జంపు కన్నతల్లి -ఉమామహేశ్వరరావు, వైస్ ఎంపిపి. పి విజయ కుమారి, ఎంపిటిసిలు, సర్పంచులు , పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ యుగంధర్

నేల ఆరోగ్యాన్ని పరిరక్షించాలి

ప్రజాశక్తి - పాచిపెంట

స్థిరమైన దిగుబడులు పొందాలంటే నేల ఆరోగ్యాన్ని పరిరక్షించాల్సిన ఆవశ్యకత ఉందని పాంచాలి సర్పంచ్ గూడపు యుగంధర్ అన్నారు. మండలంలోని పాంచాలిలో నేలతల్లి సంరక్షణ సమితి సమావేశంలో రైతులతో మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన పంటకు నేలతల్లి సంరక్షణ ఎంతో అవసరమన్నారు. రైతులు విచక్షణ రహితంగా ఎరువులు, పురుగు మందులు వాడడం వల్ల భూమి ఆరోగ్యం దెబ్బ తినడమే కాకుండా ఆ భూమిలో పండే పంటలు తినడం వల్ల మానవుల ఆరోగ్యం కూడా దెబ్బతింటుందని తెలిపారు. ప్రతి రైతు కనీసం ఇంటి అవసరాలమేర ప్రకృతి వ్యవసాయం చేసినట్లయితే రసాయన ఎరువులపై భారం తగ్గుతుందన్నారు. యూరియా బదులుగా నానో యూరియా పిచికారి చేసుకున్నట్లయితే ఖర్చు తగ్గడమే కాకుండా నేలతల్లి ఆరోగ్యం కూడా బాగుంటుందని తెలిపారు. ప్రభుత్వం లక్షల కోట్ల రాయితీని ఎరువులపై విదేశీ కంపెనీలకు చెల్లిస్తుందని, రైతులు రసాయన ఎరువుల భారాన్ని తగ్గించినట్లయితే ఆదా చేసిన సొమ్మును మళ్లీ రైతు సంక్షేమానికి ప్రభుత్వం వినియోగించే అవకాశం ఉందని అన్నారు. అంతేకాకుండా పర్యావరణ పరిరక్షణ జరుగుతుందని, నేల ఆరోగ్యాన్ని కాపాడడం ద్వారా నీటి కుంటలు, జలపాతాల కలుష్యాన్ని నివారించవచ్చని, ఆరోగ్యవంతమైన పంటతో ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించాలంటే ప్రకృతి సేద్యమే ఏకైక మార్గమని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు, విఎఎ మోహన్‌కృష్ణ, రైతులు పాల్గొన్నారు.

49 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని ఇప్పటివరకు 49 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు పంపిణీ చేశామని ఎఒ సూర్యకుమారి తెలిపారు. రైతు సేవా కేంద్రాల ద్వారా అర్హులైన రైతులకు పంపిణీ చేస్తున్నామన్నారు. మంగళవారం అంజంగిలో 25 టన్నులు, ములగాంలో 12 టన్నులు, వీఘరపల్లిలో 6, పెదగాదపల్లిలో 6 టన్నులు చొప్పున మంజూరు చేసామన్నారు. ఇంకా మండలంలోని కొన్ని గ్రామాల్లో యూరియా పంపిణీ చేయవలసి ఉందని చెప్పారు. తహశీల్దార్ డి.ధర్మరాజు పర్యవేక్షణలో పంపిణీ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్రాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మీ తప్పులకు మాదా బాధ్యత?

మంత్రి సంధ్యారాణికి రాజన్నదొర ప్రశ్నాస్త్రం

ప్రజాశక్తి - సాలూరు

మంత్రి గుమ్మిడి సంధ్యారాణి చుట్టూ ఉన్న వ్యక్తులు చేస్తున్న తప్పులకు తాము బాధ్యత వహించాలా మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్న దొర ప్రశ్నించారు. మంత్రి వైసిపి నాయకులపై చేస్తున్న విమర్శలపై ఆయన స్పందించారు. మంగళవారం సాలూరులో గల ఆయన క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మంత్రి పరివారం రకరకాల తప్పులు చేస్తూ, మహిళలను అవమానపరుస్తూ, వ్యక్తులను మానసికంగా ఇబ్బంది పెట్టేలా సోషల్ మీడియాలో పోస్టులు పెడుతూ కేసులు ఎదుర్కొంటున్నారని గుర్తుచేశారు. అటువంటి వారి తప్పు మరిచి జల్లెడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. మంత్రి వ్యక్తిగత సహాయకుడు ఒక ఒంటరి మహిళా ఉద్యోగిని మానసికంగా, ఆర్థికంగా వేధించిన విషయం అందరికీ తెలిసిందేనని, ఆ మహిళ ధైర్యంగా పోలీసులకు ఫిర్యాదు కూడా చేసిందని రాజన్న దొర పేర్కొన్నారు. బాధితురాలికి న్యాయం జరగాలని తమ పార్టీ తరపున మాట్లాడడం తప్పు అని ప్రశ్నించారు. అంతేకాక, తమ పార్టీ నాయకులపై కూడా మంత్రి సోషల్ మీడియా విభాగంలో పనిచేస్తున్న కొంతమంది వ్యక్తులు అసభ్యకరంగా పోస్టులు పెడుతున్నారని, దీనిపై త్వరలోనే ఫిర్యాదు చేస్తామని తెలిపారు. రాజకీయాలు చేయాలని, కానీ వ్యక్తిగతంగా ఏ ఒక్కరిని దూషించరాదని టిడిపి నాయకులకు సూచించారు.

సాలూరు అభివృద్ధి ఎక్కడ?

సాలూరు నియోజకవర్గంలో అభివృద్ధి ఎక్కడ అని ప్రశ్నిస్తున్న మంత్రిని ఉద్దేశించి రాజన్న దొర మాట్లాడుతూ నియోజకవర్గంలో తిరుగుతున్న ప్రతి గ్రామంలో ప్రజలను అడిగితే, ఇక్కడ ఏదైనా అభివృద్ధి కార్యక్రమం జరిగిందంటే అది కేవలం రాజన్న దొర హయాంలోనే జరిగిందని చెబుతారని తెలిపారు. తాను ఎన్నికల ముందు కొబ్బరికాయలు కొట్టి వదిలేసే రకం కాదని, ప్రతి పని ప్రారంభించి పూర్తి చేసేందుకు కృషి చేశానని చెప్పారు. ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని గతంలో టిడిపి హయాంలో అప్పటి మంత్రి సుజయ కృష్ణ రంగారావు కొబ్బరికాయ కొట్టారే తప్ప ఒక్క ఇటుక కూడా వేయలేదని విమర్శించారు. వైసిపి వచ్చాక 75 శాతం పనులను పూర్తి చేసిందని, ఎన్నికల కారణంగా పనులు నిలిచిపోగా, మిగిలిన 25 శాతం పనులను మాత్రమే కూటమి ప్రభుత్వం పూర్తి చేసిందని తెలిపారు. అలా చెప్పకుండా, ఆసుపత్రిని పూర్తిగా తామే నిర్మించామని చెప్పడం ఎంతవరకు నిజమని మంత్రిని ప్రశ్నించారు.

ప్రజాశక్తిలో వచ్చిన కథనాలను చూపిస్తున్న రాజన్నదొర

ఒడిశా సరిహద్దు సమస్యపై తక్షణ చర్యలు అవసరం

ఆంధ్రా-ఒడిశా సరిహద్దు సమస్యను ఇప్పుడే కాకపోతే ఇంకెప్పుడు పరిష్కరిస్తారని ఆయన ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. సరిహద్దు గ్రామాల్లోని గిరిజనులు ఒడిశా పోలీసుల, అధికారుల అవమానాలకు, ఇబ్బందులకు గురవుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టు చెన్నూరు, పగులు చెన్నూరు గిరిజనులు విసిగి చెంది ఒడిశా ఇచ్చే ఏ సంక్షేమ పథకాన్ని తీసుకోవని ఏకగ్రీవంగా తీర్మానాలు చేశారని గుర్తుచేశారు. కేంద్రంలో, రాష్ట్రంలో, ఒడిశాలో కూడా ఎన్‌డిఎ ప్రభుత్వమే అధికారంలో ఉన్నందున ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించడానికి ఇది మంచి అవకాశమని రాజన్నదొర చెప్పారు. స్థానిక మంత్రి ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని సమస్యను పరిష్కరించాలని, లేకుంటే వారు చరిత్ర హీనులు అవుతారని ఆయన హెచ్చరించారు. మంత్రి నియోజకవర్గంలో కనీసం ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో చదువుకుంటున్న గిరిజన విద్యార్థిని విద్యార్థులకు కంచాలు కూడా కరువవ్వడంపై వివిధ దినపత్రికల్లో ప్రతిరోజు వార్తలు వస్తున్నా వాటిని కనీసం పట్టించుకోకపోవడం, అన్ని అభివృద్ధి కార్యక్రమాలను పక్కనపెట్టి గొప్పలు చెప్పుకోవడం మన దౌర్భాగ్యమని ఆయన తెలిపారు. విలేకరుల సమావేశం పట్టణ వైసిపి అధ్యక్షులు వంగపండు అప్పలనాయుడు, కౌన్సిలర్లు, వైస్ ఎంపిపి రెడ్డి సురేష్, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సిఐటియు మహాసభలు విజయవంతం చేయాలి

ప్రజాశక్తి పాలకొండ

ఈనెల 31 నుంచి జనవరి 4 వరకు విశాఖపట్నంలో జరిగే సిఐటియు అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు పిలుపునిచ్చారు. అలాగే జనవరి 4న విశాఖపట్నం ఆర్‌కె బీచ్ వద్ద జరిగే భారీ బహిరంగ సభలో యావన్మంది కార్మిక వర్గం పాల్గొవాలని కోరారు. మంగళవారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ అవుట్ గేటు ప్రాంతం ఆటో డ్రైవర్లతో కలిసి సిఐటియు అఖిల భారత మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్లకు మేలు చేసేందుకు, కార్మిక వర్గం హక్కులను హరించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకుంటున్నాయని, ఈ విధానాలకు వ్యతిరేకంగా బలమైన కార్మిక ఉద్యమాన్ని నిర్మించడంలో సిఐటియు అగ్రభాగాన నిలిచిందని తెలిపారు. దేశంలో వివిధ రంగాల కార్మికులను, సంఘాలను ఐక్యం చేసి బలమైన కార్మిక వర్గ పోరాటాలను నిర్మించేందుకు 5 రోజుల పాటు విశాఖపట్నంలో జరిగే సిఐటియు అఖిలభారత మహాసభలు దోహదపడతాయని అన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పనిగంటలు పెంచుతూ చట్టం చేయడం దుర్మార్గమన్నారు. ప్రజలకు సేవచేయమని అధికారం ఇస్తే పెట్టుబడిదారులకు సేవచేస్తుందని విమర్శించారు. కార్మికులకు నష్టం చేసి, యాజమాన్యాలకు లాభం చేకూర్చేలాఉన్న రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని ఖండించారు. ఆటో డ్రైవర్లు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని, లైసెన్స్ ఉన్న ప్రతి ఆటో డ్రైవర్‌కు సేవలు అమలు చేయాలని, జీవో 21 రద్దు చేయాలని, పెట్రోలు, డీజిల్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి కాద రాము, ఆర్టీసీ కాంప్లెక్స్ అవుట్ గేటు ఆటో డ్రైవర్ యూనియన్ నాయకులు ఎస్.కామేశ్వరరావు, ఎస్.నాగరాజు, ఎస్.ప్రసాదరావు, ఎస్.సుందరరావు, ఎస్.సింహాద్రి, ఎస్.సింహాచలం, ఎస్.చుక్కు, ఎస్.సునీలు, ఎస్.చంద్ర తదితరులు పాల్గొన్నారు.

అన్ని గ్రామాల్లోనూ పనులు ప్రారంభించాలి

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని అన్ని గ్రామాల్లోనూ ఉపాధి పనులు ప్రారంభించాలని ఎపిఒ టి.బాలకృష్ణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో మంగళవారం సమావేశ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 35 పంచాయతీల్లో పనులు ప్రారంభించాలని, మండలంలో 2వేల మంది వేతనదారులకు పనులు కల్పించాలన్నారు. పిల్ల కాలువలు, ఫారం ఫండ్స్, సోప్ ఇట్స్, గోసాల పనులు చేపట్టాలన్నారు. ఇప్పటికే గుచ్చిమి, సూరంపేట గ్రామాల్లో పనులు ప్రారంభించామని తెలిపారు. సమావేశంలో ఇసి సోమేశ్వరరావు, టెక్నికల్ అసిస్టెంట్లు లక్షణారావు, శ్రీదేవి, ధనలక్ష్మి, వివిధ గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నాటు సారా కేంద్రాలపై సంయుక్త దాడులు

ప్రజాశక్తి - కురుపాం

ఆంధ్రా- ఒడిస్సా సరిహద్దు గ్రామమైన రెబ్బ పరిసరాల్లో నాటు సారాయి తయారీ స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు కురుపాం ఎక్సైజ్ సిఐ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాడిలో నాటు సారా తయారీ కోసం 4 డ్రమ్ముల్లో సిద్ధంగా ఉంచిన 800 లీటర్ల పులిసిన బెల్లపు ఊట స్వాధీనం తీసుకొని ధ్వంసం చేసి నాటు సారా నిర్వాహకుడు తాడంగి గోపాల్‌పై కేసు నమోదు చేసి, అతడిని అరెస్ట్ చేయనున్నామని సరిహద్దు ద్వారా నాటు సారా రవాణా చేసేవారిపై, బెల్లం సరఫరా చేసే వారిపై పూర్తి సమాచారం తమ వద్ద ఉందని, తదుపరి దర్యాప్తు పూర్తి చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తాం : ఎమ్మెల్సీ

ప్రజాశక్తి - పాలకొండ

మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరిస్తే వ్యతిరేకిస్తామని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు కూటమి ప్రభుత్వం పూనుకుంటుందని, దీన్ని వైసిపి పూర్తిగా వ్యతిరేకిస్తుందన్నారు. కోటి సంతకాల ఉద్యమంలో భాగంగా మంగళవారం ఎమ్మెల్సీ స్వగృహంలో నాయకుల నుంచి సంతకాలను సేకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ సేకరించిన సంతకాలను బుధవారం జిల్లా పార్టీ కార్యాలయానికి అందజేస్తామన్నారు. అక్కడి నుంచి ఈనెల 15న తాడేపల్లి వైఎస్ఆర్సిపి కేంద్ర పార్టీ కార్యాలయానికి అందించనున్నట్టు తెలిపారు. ఈనెల 17న గవర్నర్‌కు మాజీ సిఎం జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో సమర్పించనున్నట్టు తెలిపారు. అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు వర్తింపు చేయాలని లేనిపక్షంలో వైసిపి వారు తరుపున పోరాటం సాగిస్తుందని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే విశ్వాస రాయి కళావతి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలన్నారు. వైద్య విద్యను ప్రైవేటీకరించడం సరికాదన్నారు. కార్యక్రమంలో మండల వైసిపి పట్టణ అధ్యక్షులు కనపాక సూర్యప్రకాష్, వెలమల మన్మధరావు, పాలవలస ధవళేశ్వరరావు, లిల్లీ పుష్పనాథం, కడగల రవణ, దుప్పాడ పాపి నాయుడు, పల్లా భాను కోడం విజయ్ కుమార్, బాసూరు కాంతారావు, తూముల లక్ష్మణరావు, టి.శంకర్రావు, పొట్నూర లక్ష్మణరావు, తెర్లింగం ఉపేంద్ర, నెల్లి శివప్రసాద్ తదితరులు ఉన్నారు.

నడుకూరులో వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని నడుకూరులో మంగళవారం స్థానిక వైద్యాధికారి ఎం.సాయికుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వర పీడితులు, గర్భిణీలు, మధుమేహ, రక్తపోటు, తదితర రకాలైన రోగులకు ప్రత్యేక వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ శుభారాతమని, ఎంఎల్ హెచ్పి, ఏఎన్ఎం ,104 సిబ్బంది, ఆశ కార్యకర్తలు, గ్రామస్తులు, పాల్గొన్నారు.

సురక్షిత ప్రసవమే లక్ష్యం : ఎన్‌సిడి పిఒ

ప్రజాశక్తి - కొమరాడ

గర్భిణుల సంపూర్ణ ఆరోగ్యమే ధ్యేయంగా ప్రతి నెలా నిర్వహిస్తున్న పిఎంఎస్ఎంఎ కార్యక్రమం ద్వారా సురక్షిత ప్రసవమే లక్ష్యంగా గర్భిణీలకు మెరుగైన వైద్య సేవలు అందజేయాలని జిల్లా ఎన్‌సిడి ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావు పేర్కొన్నారు. మండలంలోని కెఆర్‌బి పురం, కొమరాడ పిహెచ్‌సిల్లో పిఎంఎస్ఎంఎ కార్యక్రమాన్ని మంగళవారం ఆకస్మికంగా ఆయన తనిఖీ చేశారు. మాతా, శిశు సంరక్షణ కార్డుల్లో ఆరోగ్య తనిఖీలు, పరీక్షల వివరాలు, నివేదికలు క్షుణ్ణంగా పరిశీలించారు. గర్భిణుల ఆరోగ్య స్థితి, మెరుగు ప్రతి నెలా ఏ మేరకు ఉంటుందో గమనించి కాన్పు తేదీలు, ప్రస్తుత ఆరోగ్య స్థితి, క్షేత్రస్థాయిలో, ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలపై గర్భిణీలతో మాట్లాడి తెలుసుకున్నారు. ముఖ్యంగా గిరిశిఖర, మారుమూల గర్భిణులకు వైద్య సేవలు అందజేయడంలో జాప్యం లేకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సిబ్బందిని ఆదేశించారు. గర్భిణుల నమోదు మొదలు ప్రసవానంతరం వరకు పూర్తిస్థాయిలో వైద్య పరీక్షలు, పర్యవేక్షణ తప్పనిసరి అని తెలిపారు. ఎంసిపి కార్డు నమోదుపై ఆరా తీసి సూచనలు చేశారు. ప్రతి గర్భిణీ హిమోగ్లోబిన్, బరువు సాధారణ స్థితిలో ఉండేలా ఐరన్ మాత్రలు, పౌష్టికాహారం సక్రమంగా తీసుకునేలా పర్యవేక్షణ ఉండాలన్నారు. పిహెచ్‌సిలో డెలివరీ చేయడానికి ఆస్కారం ఉన్న గర్భిణీలను ముందుగానే అవగాహన కల్పిస్తూ, ప్రసవాలు మెరుగు పడేలా కృషి చేయాలన్నారు. శీతాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు శామ్యూల్, జి.దేవేంద్ర, ఆరోగ్య పర్యవేక్షకులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యువత, విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న డిఎస్‌పి రాంబాబు

డ్రగ్స్ భూతాన్ని తరిమికొడదాం : డిఎస్‌పి

ప్రజాశక్తి - వీరఘట్టం

డ్రగ్స్ భూతాన్ని తరిమికొట్టేందుకు యువత, విద్యార్థులు బాధ్యత వహించాలని పాలకొండ డిఎస్‌పి ఎం.రాంబాబు ప్రజలకు సూచించారు. మండలంలోని నడిమికెళ్లలో డ్రగ్స్‌పై ఏర్పాటు మంగళవారం చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. యువత చెడు అలవాటులకు దూరంగా ఉండాలని కోరారు. భవిష్యత్తు మెరుగుపరచుకో.. జీవితాన్ని నిలబెట్టుకో... డ్రగ్స్‌కులోనవ్వకు అని పిలుపునిచ్చారు. అంతకు ముందు పార్వతీపురం నుంచి డ్రగ్స్ సైకిల్ యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై జి కళాధర్,సిబ్బంది, విద్యార్థులు, గ్రామస్తులుపాల్గొన్నారు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జోగారావు

వైసిపి ఆధ్వర్యాన నేడు బైక్ ర్యాలీ

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ప్రభుత్వ మెడికల్ కళాశాలను ప్రైవేటీకరణ చేస్తున్న కూటమి ప్రభుత్వ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా వైసిపి ఆధ్వర్యాన నిర్వహిస్తున్న కోటి సంతకాలు సేకరణ ప్రజా ఉద్యమం కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలో సేకరించిన 65 వేల సంతకాలు పత్రాలను బుధవారం భీమిలిలోని వైఎస్ఆర్ విగ్రహం వద్ద నుంచి పార్వతీపురం వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించి జిల్లా పార్టీ కార్యాలయానికి సంతకాల పత్రాలను ప్రత్యేక వాహనం ద్వారా చేరవేసే కార్యక్రమం చేపట్టనున్నట్టు మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని నియోజకవర్గ పరిధిలోని ఉన్న జిల్లా పార్టీ ప్రతినిధులు, అన్ని మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మున్సిపల్ చైర్ పర్సన్, వైఎస్ చైర్మన్లు, జిల్లా, రాష్ట్ర, నియోజకవర్గ స్థాయి వివిధ పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, సర్పంచ్ లు, ఎంపీటీసీలు, కౌన్సిలర్ సభ్యులు, సోషల్ మీడియా కార్యకర్తలు, మాజీ ప్రజా ప్రతినిధులు, మహిళా ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలుతో పాటు పెద్ద ఎత్తున మద్దతు తెలిపిన ప్రజాసంఘాలు, విద్యార్థులు, వామపక్షాలు అందరూ కలిసి పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. విలేకర్ల సమావేశంలో జిల్లా వైసిపి ఉపాధ్యక్షులు బలగ శ్రీరాములు నాయుడు, ప్రధాన కార్యదర్శి పోల సత్యనారాయణ, పట్టణ పార్టీ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, మున్సిపల్ వైస్ చైర్మన్ యిండుపూరు గుణ్ణేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు..

కాంగ్రెస్‌తోనే దేశాభివృద్ధి

ఘనంగా సోనియాగాంధీ పుట్టిన రోజు వేడుకలు

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

దేశాభివృద్ధికి కాంగ్రెస్ పాలన అత్యవసరమని స్థానిక కాంగ్రెస్ నాయకులు అన్నారు. మంగళవారం స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో ఆ పార్టీ అధినేత్రి సోనియాగాంధీ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్వతీపురం నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్చార్జ్ బత్తిన మోహన్ రావు, ఒబిసి జిల్లా చైర్మన్ వంగల దాలి నాయుడు, సెల్ జిల్లా చైర్మన్ కోలాకిరణ్ కుమార్, నియోజకవర్గం చైర్మన్ సిరిసిపల్లి సాయి శ్రీనివాస్, మండల అధ్యక్షులు తీళ్ళ గౌరీ శంకరరావు తదితరులు కేక్ కట్ చేసి సోనియాగాంధీకి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిజెపి పాలనలో దేశాభివృద్ధి కుంటుపడిందన్నారు. ఇందుకు ఉదాహరణగా ఇటీవల రూపాయి విలువ తగ్గిన సందర్భాన్ని గుర్తు చేశారు. కార్పొరేట్ శక్తుల చేతుల్లో దేశం నలిగిపోతుందన్నారు. దేశంలో కర్షక, కార్మిక వర్గాలు అసంతృప్తితో ఉన్నాయన్నారు. నిరుద్యోగం పెరిగిపోతోందన్నారు. భారతదేశ ఎప్పటికీ అభివృద్ధి చెందుతున్న దేశంగానే ఉంటుందన్నారు. దేశంలో పెట్టుబడిదారుల హవా, ఏకస్వామ్యం కనబడుతోందన్నారు. ఇందుకు ఇటీవల దేశంలో నెలకొన్న ఇండిగో విమానాల సంక్షోభాన్ని గుర్తు చేశారు. దీనివల్ల దేశం పరువు పోయే పరిస్థితి వచ్చిందని విమర్శించారు. దేశంతో పాటు రాష్ట్రంలో ప్రజా కంతక పాలన సాగుతోందని ఆరోపించారు. నిత్యవసరాలు, పెట్రో, ధరలు పెరిగి సామాన్యుడు సతమతమవుతున్నాడన్నారు. కావున దేశాభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ పాలన అత్యవసరమన్నారు. కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ సారధ్యం దేశ ప్రజల అభ్యున్నతికి ఎంతో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : ఆలిండియా కాంగ్రెస్ అధినేత సోనియా గాంధీ జన్మదిన వేడుకలు మంగళవారం గుమ్మలక్ష్మీపురంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కురుపాం నియోజకవర్గ కాంగ్రెస్ కో-ఆర్డినేటర్ అడ్డాకుల చిన్నారావు మాట్లాడుతూ నిరుపేదలకు పట్టెడు మెతుకులు కడుపార తినేలా, ఏడాది పొడవునా ఉన్న ఊరిలోనే చేతినిండా పని కల్పించేలా ఉపాధిహామీ చట్టాన్ని ప్రవేశపెట్టారన్నారు. అందరికీ ఆరోగ్య భద్రత కల్పిస్తూ తలా రూ.5లక్షలు ఆరోగ్య భీమా, వెరసి అటవీ హక్కుల చట్టం, ఆరోగ్యశ్రీ, 108, ఇందిరమ్మ ఇళ్లు వంటి ప్రజాహిత సంక్షేమ కార్యక్రమాలకు 'అంకురార్పణ ' చేశారని అన్నారు బిజెపి, కాంగ్రెసేతర పార్టీలు రాకతోపై సంక్షేమ పథకాలన్నీ అటకెక్కాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిక్షణం- ప్రజాహితం కోరుకునే కాంగ్రెస్ సంక్షేమ రాజ్యం రాకతోనే మన అందరికీ మేలని, ఇందుకు , విజ్ఞులైన చదువరులు, నిరుద్యోగులు, కార్మికులు, ఉద్యోగ వర్గాలు కాంగ్రెస్ నాయకత్వానికి చేదోడుగా కలిసి రావాలని చిన్నారావు అభ్యర్థించారు. కార్యక్రమంలో గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు కోలక జయరాం, మీసాల ఫ్రాన్సిస్, ముఖ్య కార్యకర్తలు పాలక సంపత్ కూమర్, బిడ్డక శ్రీధర్, గంట రాహుల్‌తో పాటుగా మండల ఆటో యూనియన్ ప్రతినిధులు పి.మహేంద్ర, రమేష్, మహేష్, విశ్రాంత ఉపాధ్యాయులు పాలక జయంతిరావు, స్థానిక పండ్ల వ్యాపారస్తులు పాల్గొన్నారు.

విజయనగరం కోట : ఎఐసిసి నాయకులు సోనియా గాంధీ జన్మదిన వేడుకలు మంగళవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా డిసిసి అధ్యక్షులు విద్యాసాగర్ మాట్లాడుతూ సోనియా గాంధీ చైర్ పర్సన్‌గా ఉండగా యుపిఎ ప్రభుత్వం తెచ్చిన సమాచార హక్కు చట్టం, భూసేకరణ చట్టం, గ్రామీణ ఉపాధి హామీ చట్టం, ఆహార భద్రత చట్టం, విద్యా హక్కు చట్టం ప్రజలకు ఎంతో ఉపయోగపడుతున్నాయని అన్నారు. రైతుసంక్షేమమే ధ్యేయంగా చేసిన రుణమాఫీ కానీ, పేదల సంక్షేమమే ధ్యేయంగా చేసిన ఇతర పనులు ఆమెలోని మానవతామూర్తిని ఆవిష్కరిస్తాయన్నారు. కార్యక్రమంలో బంగారునాయుడు, మోహన్, , షరీఫ్, రెహమాన్, ప్రసాద్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం : కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

విజయనగరంలో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

60వేల సంతకాలు సేకరణ

బొబ్బిలి: మెడికల్ కళాశాలలు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నియోజకవర్గంలో 60వేలు సంతకాలు సేకరణ చేసినట్లు మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు చెప్పారు. స్థానిక వైసిపి కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలలను పిపిపి పద్ధతిలో ప్రైవేటీకరణ చేసేందుకు కుట్ర చేస్తుందన్నారు. పేదలకు ఉచిత వైద్యం, వైద్య విద్యను అందించేందుకు ఏర్పాటు చేసిన కళాశాలలు ప్రైవేటీకరణ చేయడం అన్యాయమన్నారు. సంతకాలు సేకరణ పత్రాలకు బుధవారం శ్రీవేణుగోపాల స్వామి ఆలయంలో పూజలు చేసి చంద్రబాబుకు మంచి బుద్ధి ప్రసాదించాలని కోరుతామని చెప్పారు. ప్రభుత్వమే మెడికల్ కళాశాలలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

బ్లాక్ స్పాట్‌లను పరిశీలిస్తున్న డిఎస్‌పి భవ్యరెడ్డి

రోడ్డు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు

దత్తిరాజేరు: రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఆర్‌టిసి డ్రైవర్లు జాగ్రత్తలు పాటించాలని బొబ్బిలి డిఎస్‌పి జి.భవ్యరెడ్డి తెలిపారు. మంగళవారం వార్షిక తనిఖీలలో భాగంగా పెదమానాపురం పోలీస్ స్టేషన్‌ను ఆమె సందర్శించారు. కేసుల వివరాలు వాటి పురోగతి, రికార్డులను స్టేషన్ పరిసరాల పరిశుభ్రత ఎస్ఐ పనితీరు చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం గజపతినగరం సిఐ జివివి రమణతో కలిసి ఆర్‌టిసి డ్రైవర్లతో సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఆర్‌టిసి డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

మృతి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ గౌరీశంకర్

గాయపడిన ఫీల్డ్ అసిస్టెంట్ మృతి

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని లోవముతా బుడ్డెమ్మఖర్జ సమీపంలో ఇటీవల జరిగిన రెండు ద్విచక్ర వాహనాల ఢీకొన్న ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కిచ్చాడ పంచాయతీ ఉపాధిహామీ క్షేత్ర సహాయకుడు గోళ్ల గౌరీశంకర్ విజయనగరంలోని ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఈ సందర్భంగా సమీప గ్రామల ప్రజలు తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. ప్రతిరోజూ గ్రామానికి సేవ చేస్తూ కుటుంబాన్ని, ప్రజలను ఆదుకునే వ్యక్తి ప్రాణాలు కోల్పోవడం తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. క్షేత్ర సహాయకుడి మృతి పట్ల ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి, ఎపిఒ డివిఎస్ మూర్తి, సిబ్బంది కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

అనారోగ్యంతో ఉపాధ్యాయుడు మృతి

ప్రజాశక్తి - సీతంపేట

సీతంపేటకు చెందిన ఉపాధ్యాయుడు జన్ని శ్రీనివాసరావు (52) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఈయన శంభాం పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు. ఉపాధ్యాయుడి మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.